రాయలసీమ గబ్బిలం

"దండాలు సామీ దండాలు! ఎండికొండ ఎలుపా, దండాలు! ఎద్దునెక్కే దేవరా దండాలు! పాపకరమాలు బాపేవాడా, దండాలు! ఊళ్ళుదాటి, ఏళ్ళుదాటి, కొండలు దాటి, కోనలు దాటి, పొలాలు దాటి, బీళ్ళు దాటి వొస్తిసామీ, యింత దూరమొస్తే! వచ్చినందుకు నిన్ను జూడగంటి! నేనొచ్చిన పని అట్లా వుండనీ! నిన్ను జూచిన కతన నాజలమ దన్యమైపోయ!" అంటా నేను పరమేశుడి పాదాలపైన వాలిపోయినాను.

కన్నుల్లోనుంచి దయారసం కురిపిస్తా, ఆయన చల్లగా నా కల్ల జూచినాడు, చూచి అనినాడు గదా-

"సంతసించినాను లేవే తబిసి పక్షీ! నీ భక్తికి మెచ్చినాను, చాలా దూరంనుంచి వచ్చినట్టు చెబుతున్నావు, ఏ వూరు మీది? ఏం పనిమీద వచ్చినా వింత దూరం?"

ఇంకేముంది! సామి సెలవిచ్చినాడు గదా! జంకుగొంకులు లేకుండా నేను నా సొదవెళ్లబోసుకుంటి - "మనవి చేస్తాను సామి! నువ్వు వుండే మంచుకొండలకు దచ్చినంగా భరతుదేలిన దేశముండాది గదా? ఆ దేశంలో తెలుగోల్లుండే తిల్లింగ బూములుండాయి గదా! ఆ బూముల్లో ఒక భూమి సామీ, రాయలసీమ! ఆ రాయలసీమలో మాది చిత్తూరు మండలం! చిత్తూరికి ఉత్తరంగా కడపకు బోయే తార్రోడ్డుపైన నలభై నాలుగో మీటరురాయి దగ్గర తూరుపుగా మలుపుతిరిగి నాలుగ్గడియలసేపు నడిస్తే మా వూరొచ్చేస్తాది. నాగులేరు గట్టున వుండేది మావూరు. నన్నూరు కడపలుండేది మా వూరు! పెద్ద పెద్ద మీసాల మోతుబరులుండేది మా వూరు! నాగులపాడని పేరు! అదేసామి మా వూరు!"

"మంచిది, మంచిది. ఇంతకు నీవు వచ్చిన పనేమిటో? చెప్పుకో" అన్న ఎచ్చరిక చెప్పినాడు సామి.

"చిత్తం దేవరా! జరిగిందీ, జరగబోయేదీ అన్నీ తెలిసిన మహన్నతభావుడివి! నీకు తెలియని వివరాలా! అయినా అడిగితివి కాబట్టి చెప్తావుండా! మర్రిచెట్టు దాపున ఆముదం చెట్టు మాదిరిగా, పెద్ద కొండపక్కన చిన్న గుట్ట మాదిరిగా, ఏనుగు నీడలో మేకపిల్ల మాదిరిగా ఆ పెద్ద వూరికి కూతవేటుదూరంలో ఒక చిన్న వూరు, వెలివాడ - అంటారు దాన్ని! ఆ పెదవాడకు, ఈ వెలివాడకు మధ్యన ఎప్పుడో ఓబికాలంలో చోలరాజులు కట్టించిపోయిన ఒక గుడి వుంది. నేనుండెదైతే ఆ గుడిలోనే గానీ, ఆ దేవుడి పేరు చెప్పాలంటే మాత్రం నోరు తిరగదు. ఎరామరేశ్వరుడో, ఏందో, ఆ గుడిపనిపైన నన్నొకరు పంపించినారు సామీ రాయబారం."

పరమశివుడి కన్నుల్లో ఆలోచన చిందులు ద్రొక్కింది. నుదురు కుచించుకపోయి మూడోకన్ను మూతపడింది. గొంతు సవరించుకుంటూ, ఆయన అనినాడు గదా "నువ్వుండవే రాత్రించరీ! గబ్బిలాల రాయబారమంటేనే నేను ఖంగుదిని పోయినాను. యాభైయేళ్ల క్రితం ఒకసారి యిట్లాగే జరిగింది. ఆ గబ్బిలం వడ్డించి పోయిన వడ్డింపులు నాకింకా అరగనేలేదు"...'

"మన్నించాల సామీ! అప్పుడొచ్చింది నేను గాదు. అది కోస్తా గబ్బిలం, నేను రాయలసీమ గబ్బిలాన్ని!" అని సరిది చెప్పుకొంటి.

"ఏ గబ్బిలమైతే నేమిలే! గొంతు కోసుకోడానికి ఏ కత్తి అయిన ఒక్కటే గదా! అని ఎడాపెడా దులిపిపారేసిందనుకో! నరుల్లో కొందర్ని ముట్టుకుంటే అంటు తగుల్తుందని చెబ్తూ, మానవులు పందుల్ని, నందుల్ని, పాముల్ని పూజచేయడంలోని ఆంతర్యమేమిటి స్వామీ' అని ఆరా తీసింది. దురాచారాల్ని ఖండించని చదువేం చదువని ఈసడించి పారేసింది. పుట్టరానిచోట పుట్టినందువల్ల ఎన్నెన్ని కోయిల పాటలు, ఎన్ని వెన్నెల రాత్రులు, ఎంతటి కమ్మ నెత్తావులు, ఎంత కాంతి, ఎంత శాంతి వృథా అయిపోయిందో గదా అని ఎత్తిపొడిచింది. కడగొట్టు జాతులనబడేటి వాటి కన్నీటి మబ్బులు పిడుగులైరాలి ఈ సమాజాన్ని బద్ధలు చేయవా అని గద్దించింది. సర్వజీవులూ నీకు సమానమని చెబుతారే, అయితే ఈ అవలక్షమేమిటి సామీ? అని నిలదీసి అడిగింది. ఎందుకు లేవే తబిసి గుబ్బెతల రాణి! దాని వాదానికి తట్టుకోలేక నా హిమశైలసింహాసనమే కదిలిపోయింది. తలపైని చంద్రరేఖ సైతం మారిపోయ్యేటట్టు నా బుర్ర వేడెక్కిపోయింది. ఆకారం చిన్నదే! ముక్కూ, మొగమూ వేర్వేరుగా కానరాని చీకటి ముద్దలాగే వుంటుంది. అయితేనేమి? అలిసిపోక, సొలసిపోక, పట్టిన పట్టు విడవక నా లోకానికి వచ్చింది గదా! కదలిక లేని నిండు చెరువులో గుండ్లు పడవేసి పెద్ద సంచలనం కలిగించింది గదా! ఎలాగో దాన్ని సముదాయించి పంపించేసేదాకా నాకు ఊపిరాడలేదు గదా! చాలని దానికి మళ్లీ నువ్వొక్కతెవి దాపురించావా? నువ్వేం రాయబారం తెచ్చావే, నా మ్రింగరాని కవళ్లమా!" ఆక్రోశించినట్టుగా అడిగినాడు మూడు కన్నుల సామి.

'మహన్నబావుడికి కోపం వచ్చేసినట్టుందిరా బాబూ' అని నేను 'మన్నించు తండ్రీ' అని చెంపలు వాయించుకుంటిని. 'లోకాలనేలేటి సామి! మహాదేవ! ఆలించినా నీవే! పాలించినా నీవె! దీనులను బ్రోవగా, ఆర్తులన్ కావగా నీవే గదా దిక్కు...' అని ఒక దండకం దండకం అంతా వల్లం చేస్తి. బోలా శంకరుడు గదా! శాంతిమూర్తి అయిపోయినాడు పాపం! 'సరేలేవే గబ్బిలయా! నువ్వు వచ్చిన పనేమిటో చెప్పు' అని ఆనతిచ్చినాడు.

"ఏముంది సామీ! కోస్తా గబ్బిలమొచ్చిపోయి చాలాకాలమైంది గదా! అయినా పరిస్థితులు పూర్తిగా మారిపోయినట్టు చెప్పడానికి వీల్లేకుండా వుంది. నేనేమో కోస్తా గబ్బిలమంత చొరవైనదాన్ని గాకపోతిని, తమరు కోప్పడితే నాకు నోరు పెగలదు, మనసుంచి, నెనరుంచి కొంచెం చెవి ఒగ్గివింటే మనవి చేసుకుంటా...?"

"పరిస్థితులు మారలేదా!" అక్కజవతి పోతూ కొనసాగించినాడు సామి. "వర్ణ భేదాల పేరుతో ఎవరికీ అన్యాయం జరగరాదని, సమస్త జనులకూ సాంఘిక న్యాయం ఒకేరకంగా రూపొందాలని నేను చెప్పి పంపినాను గదా! ఈ ధర్మాన్ని నెలకొల్పేందుకు రాట్నాన్ని మోసుకుంటూ, దుడ్డుకర్ర చేతబట్టుకుని ఒక గుజరాతు ముసలాయన గూడా వచ్చినాడు గదా? గాంధీలు, వినోబాబావేలు, అంబేద్కర్లూ! అలా ఎందరో పూనుకున్నా మీ పరగణాల్లో సమాన న్యాయం, నెలనాటుకోలేదా?" అంటూ వాపోయినాడు.

"ఏం జెప్పుదును సామీ! అంగవంగ కలింగ...... అంటూ యాభై రాజ్యాలున్నాయని గదా పెద్దలు చెప్పింది! మా రాయలసీమ ఆ లిస్టులో చేరని యాభై ఏడో దేశమైపోయింది. నాలుగు పడగల ఐందవ నాగరాజుని గదా మునుపటికి కోస్తా గబ్బిలం చెప్పింది! ఇప్పుడా నాగరాజు కులాల పడగలెత్తింది. పేర్లెందుకుగాని మా వూరనేదే ఒక రాజ్యమైతే

దానికి రాజు పెదరెడ్డి, మంత్రి పెదనాయుడు. కుర్చీలు మారితే మారొచ్చు. అప్పుడు నాయుడు రాజు, రెడ్డి మంత్రి, గ్రామ పంచాయితీ వాళ్లదే. ఒంటి కిటికీ వాళ్లదే! చౌకబియ్యం డిపో వాళ్లదే! గుడి మణియం వాళ్లదే, ఊళ్లో మద్దెస్తాలూ వాళ్లవే, వాళ్లు చేసింది చట్టం. చెప్పింది న్యాయం. ఇంకొకరి మాట ధండలాయించగూడదు. నేనొచ్చింది దేవలం పని పైనా గదా! ఆ సంగతే మనవి చేస్తా. గుడికి సంబంధించి పూజారి మాన్యం వుంది. తిరణాల దినాల్లో దేవుడి పల్లకీ మోసేవాళ్ల మాన్యం వుంది. తప్పుతప్పు. ఒకప్పుడుండేది. ఇప్పుడా మాన్యాలన్నీ పెదబాబుల కనుతాల్లో కలిసిపోయినాయి. గుడి రివాజులన్నింటినీ మావూరి ధర్మప్రభువులు రద్దుచేసి పారేసినారు. ఏడాదిలో మున్నూట అరవై నాలుగు రోజులు సింహద్వారం బందు. ఒక శివరాత్రికి మాత్రం తెరుస్తారు. పడమటి వైపు పారిగోడ నాలుగు బారల మేరకు కూలిపోయింది. పొరుగూరి బాపనాయన ఒకడు ఆ దోవగుండా వారంలో ఒక సోమవారం నాడు మాత్రం వచ్చి దేవుణ్ణి కడిగి, ఓ పువ్వు తలపైన వేసి, ఒక పట్టెడన్నం పెట్టి తన దారిని తాను వెళ్లిపోతాడు. పొద్దుపోయి చీకటి పడినాక ఒక ముసలమ్మ లోపలికొచ్చి ఇనపప్రమిదలో ఒక గంటెడు నూనె పోసి దీపం వెలిగించి పోతుంది. అరగంట సేపట్లో చమురైపోతే, ఆ దీపం కాసేపు రెపరెపలాడి కొండెక్కిపోతుంది. ఆ పైన దేవుడికైనా, నాకైనా మిగిలేది చిమ్మచీకటే! పూజలేదు, ప్రసాదం లేదు, దీపం లేదు, దూపం లేదు. ఆ దేవుడికొచ్చిన గతి చూస్తావుంటే నా గుండె తరుక్కుపోతావుంది. అందుకని జెప్పి అక్కడుండలేక గుడిదాటి, పారిగోడదాటి, నేను చక్కా వెలివాడ సందు గొందుల్లోకి పారిపోతూ వుంటాను – పారిపోతూ వుండగా, ఏం జరిగిందంటే..." "ఏం జరిగింది?" స్వామి ఆత్రంగా అడిగినాడు.

"వెలివాడ నడివీధిలో ఒక రచ్చవుంది సామీ! ఆ రచ్చపైన కుక్కి మంచంలో పడుకోనుండే పైడి మల్లన్న ఎట్లనో నా పొలకువ పసి కట్టేసినాడు. గబ్బిలమా, గబ్బిలమా! నా మనవి ఒకటి వినవా! నేను చెప్పినట్టు చేయవా! అంటూ ఒకటే ప్రాధేయ పడిపోయినాడు."

"ఏమంట? పైడి మల్లన్న కొచ్చిన కష్టమేమైనా వుందా?" స్వామి విచారణ చేసినాడు.

"నేనూ అదే మాట అడిగినాను సామీ! 'చూడు మల్లన్నా! గవుర్మెంటు మరెన్నో విధాలుగా సాయపడతావుంది గదా! వానాకాలం వస్తే వురుస్తుందనుకో అయినా తలచాటుగా ఇండ్లు కట్టించి యిచ్చింది గదా? మీ బిడ్డలకు ఉచితంగా చదువు చెప్పించే ఏర్పాటు చేసింది గదా? మీ సంగతలా వుంచు, మీ వోట్లకోసమైనా నాయకులనబడేవాళ్లు మిమ్మల్ని మంచిగానే చూచుకోవాల్సిన అవసరం వుంది గదా! అయిదేండ్లకొకసారి వోట్ల పండగలొచ్చినప్పుడైనా వాళ్లు మీ వాడలో అడుగుపెట్టి, మీ అరుగులపైన కూచుని, మీరిచ్చే నీళ్ళు తాగుతారు గదా! ఎక్కడైతే వుండాలో అక్కడే వుండిపోయేటట్టుగా, అంతకంటే ఎత్తులకు ఎదగవలసిన అవసరం లేకుండా మీరు బతికి బట్టకట్టడానికి వీలుగా రెండు రూపాయల బియ్యంగూడా యిస్తున్నారు గదా! ఇవన్నీ చాలక మీకింకా ఏం కావలసి వచ్చింది?' అని నేను విదిలించి పారేసినాను. అప్పుడు పైడి మల్లన్న ఏమనినాడో తెలుసునా సామీ"?

"అంగట్లో అన్ని వుంటే ఏం లాభం లేదే గబ్బిలాల దొరసానీ, అల్లుడినోట్లో శని వుండిపోయిందే! కాశీలో విశ్వనాధుడు కుల బేదాలు లేకుండా మనుషులనందరినీ

చేరదీసుకుంటూ వుండాడు. తిరుమలలో ఏడు కొండలవాడి గుడిలోకి లచ్చలాది జనం వెళ్లొస్తావుండారు గదా! వాళ్లల్లో ఎవరినీ 'నువ్వే కులం వాడివి' అని అడిగే వాడు లేదు. ఇంకా రామేశ్వరం, చిదంబరం, తిరుమన్నామల, బద్రాచలం, శ్రీశైలం, సిమ్మాచలం... యిట్లా ఎన్నో దేవళాలుండాయి గదా! అక్కడెక్కడా కులం పేరుతో గుడిలోకి పోయే వాళ్లని అటకాయించేవాళ్లు లేరు. ఎటొచ్చీ మనవూరి గుడి సంగతే అంతా తారుమారుగా తయారైంది. ఊళ్లో వాళ్ళేమో దేవుడి ముఖమే చూడడంలేదు. వెలివాడ వాళ్లేమో గుళ్లో అడుగుపెట్టడానికి వీల్లేదు. 'అమ్మ తానూ పెట్టదు, అడుక్కో తిననివ్వదు' అన్నట్టుంది గుడిలో దేవుడి విషయంలో గ్రామ పెద్దల పెత్తనం! నాకైతే దేవుడి పరిస్థితి తలుచుకుంటే గుండె తరుక్కుపోతా వుంది. ఏం చేసినాడని పాపం, ఆయనకీ శిక్ష?"

"జీవుడికైనా, దేవుడికైనా నోరుండాలే మల్లన్నా! నోరులేకపోతే, యింతేకత" అంటూ ఓదార్చబోయాను.

"దిక్కులేనివాళ్లకు దేవుడే దిక్కంటారు గదా! ఆ దేవుడికే దిక్కులేకపోతే ఏం చేయాల? ఎవరితో చెప్పుకోవాల?" అని సంకట పడిపోయినాడు మల్లన్న.

నేనేమీ మాటాడలేదు. ఆలోచిస్తా వూరకుండిపోతి.

"మునపటి కిట్లనే, ఇక్కట్లు ముమ్మరమైపోయినప్పుడు నీలాంటి గబ్బిలం ఒకటి నేరుగా కైలాసానికే వెళ్లి వెండికొండ వేలుపుతోనే మొరపెట్టుకునిందంట! ఇప్పుడు నువ్వు మా తరుపున ఆ పనిచేసి పెట్టాల! నిన్ను పిలిచిందందుకే. ముక్కంటి వుండే ఎత్తయిన కొండ యిక్కడికి శానాదూరమే. అయినా సరే! తలుచుకుంటే నువ్వు వెళ్లి రావొచ్చు. వెళ్తే మనపనీ జరిగినట్టుంటుంది. నీకున్నూ పున్నెం కలిసొస్తుంది..." అని రకరకాలుగా బతిమాలుకున్నాడు మల్లన్న.

"అదీ సామీ సంగతి! మల్లన్న పనుపున నేనిట్లా వచ్చినాను. ఇంక వెలివాడ జనాన్ని నీటముంచినా, పాలముంచినా నీదేబారం" అని మనవి చేసి, సామి యిచ్చే బదులు కోసం కాచుకుని వుండిపోయినాను.

ఉండి వుండీ తల పంకిస్తూ ఆయన సెలవిచ్చినాడు. "అవగతమైంది లేవె తబిసి పక్షి! అన్ని సంగతులూ ఆకళించుకున్నాను. నువ్వెళ్లిపో, తాను కోరిన కోనలో వాన కురిసే రోజు చేరువలోనే వుందని మల్లన్నతో చెప్పు. మానవ జాతికి శుభం కలుగుగాక!"

***

నాగులపాడెక్కడ? నాగభూషణుడి నెలవెక్కడ? కైలాసానికి వెళ్లి రావడానికి ఎంతకాలం పట్టిందో ఎరుకలేదు. పగటి వేళల్లో ఏ చెట్లల్లోనో, పొదల్లోనో, ఇండ్ల పైకప్పుల్లోనో తలక్రిందులుగా వ్రేలాడుతూ, రాత్రుల్లో మాత్రం ప్రయాణం చేసి, ఆఖరుకెప్పుడో ఎట్లనో మా వూరు చేరుకున్నా. ఊరి వాలకంలో మార్పొచ్చినట్టుగా తోచి, అదేందో తెలుసుకుందామని, వీధులన్నీ ఒకసారి తిరిగేసినా. ఆశ్చర్యంతో ఊపిరాడ లేదనుకోండి. గుడిలో పడమటి వైపు పారిగోడ కూలిపోయిందన్నారు గదా! దాన్నెవురో ఎప్పుడో తిరిగి కట్టించేసినారు. సింహద్వారంలో తలుపులు తెరిచే వున్నాయి. ద్వార బంధానికి మామిడాకుల తోరణాలు వేలాడుతున్నాయి. దేవళమంత సుబ్బరంగా, తుడిచిపెట్టిన అద్దం మాదిరిగా వుంది. వెలిగిపోతున్న కరెంటు దీపాలతో గుడి ఆవరణంతా పట్టపగల్లా వుంది. సాతాని నాంచారయ్య తట్టనిండా పువ్వులు తెచ్చి పెళ్ళాం బిడ్డలతో

కలిసి దండలు కడుతున్నాడు. పెదరెడ్డిగారు, పెదనాయుడుగారు కూచున్నచోట కూచోకుండా నిల్చున్నచోట నిల్చోకుండా కార్యకర్తలకు పన్లు పురమాయిస్తూ అటూయిటూ తెగ తిరగేస్తున్నారు. ఏమిటబ్బా ఈ విచిత్రమనుకుంటే, ఎవరినన్నా అడుగుదామని గర్భగుడిలోకి దూసుకపోయినాను. బూజుదులిపి, దట్టంగా సున్నం కొట్టేసినందువల్ల అక్కడుండాల్సిన మా వాళ్ళందరూ ఏమైనారోగానీ అయిపులేకుండా పోయినారు. వెంటనే వెలివాడ వైపు పరుగుదీసినా. వీదులకడ్డంగా మూరెడు వెడల్పున్న తెల్లటి గుడ్డల్ని తాళ్లతో బిగించి, మనిషి తలకాయంత అక్షరాల్తో ఏందేందో రాసేసినారు. మొత్తంపైన ఏందో జరిగింది. లేదా జరగబోతావుంది. వాళ్లనీ వీళ్లనీ అడగడమెందుకని నేరుగా రచ్చ దగ్గరికే దారి తీసినా. నా రెక్కల చప్పుడు వినేటప్పటికి మల్లన్న చప్పున్న లేచి కూచున్నాడు. "అబ్బో గబ్బిలమా! ఎన్నాళ్ళకు కనిపిస్తివే నా బంగారు నేస్తమా! బాగుందావా! ప్రయాణం బాగా జరిగిందా? ఎప్పుడొస్తివి?" అని పలకరించినాడు.

"ఏందిలే మల్లన్నా! ఎన్నడిగి ఏం లాభం? వెళ్లిన పని కాయా, పండా అని మాత్రం అడక్కపోతివి" అని నిష్ఠూరపడిపోయినాను.

"నువ్వెళ్లిన పని నెరవేరిందని నెలరోజులప్పుడే తెలిసిపోయింది గదా! నారాయణ జిల్లా కలెక్టరైనాడు. మొన్ననే చార్జి పుచ్చుకున్నాడు. మొదటి పనిగా రేపు మన వూరికొస్తున్నాడు. మన వూరి వేలుపు ఏ రామేశ్వరుడికి అభిషేకం చేయించడంతో డ్యూటీ మొదలుపెడతాడు......"

"అరరే, అవునా! అట్టనా!" అంతకు మించి మాటలు పెకల్లేదు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయినాను.

భళ్లున తెల్లారింది. కిటకిటలాడిపోతూ జనం అంకాళమ్మ గుడి దగ్గర చేరిపోయినారు. పై వీధి నుంచి రెడ్లొచ్చినారు. మిట్ట వీధి నుంచీ నాయుళ్లొచ్చినారు. కట్టకట్టినట్టుగా వృత్తి పని వాళ్లందరూ వచ్చినారు. వెలివాడ జనమంతా గుడిలోనే వున్నారు. ఉదయం ఎనిమిది గంటలకల్లా బిలబిలమంటూ రెండు, మూడుకార్లు పది, పన్నెండు జీపులూ వచ్చేసినాయి. "కలెక్టరుగారికి జై. కలెక్టరు గారికి జై" అని మిన్నెగిరిపోయేటట్టుగా జనం జయ జయలు పలికినారు. కలెక్టరుగారు లోపలికి వెళ్లి, అభిషేకం చేయించి, తిరిగి వచ్చి పందిరి క్రింద కూచున్నారు. జనం బారులు తీరి ఒక్కొక్కరుగా లోపలికి వెళ్ళి దేవుణ్ణి సేవించుకుని, తిరిగి వచ్చినారు. వరుసలో నిల్చున్న కొందరివైపు చూచి ముఖం చిట్లించుకున్నవారు లేరు. 'వీల్లేదు నీవు లోపలికి వెళ్లడానికి వీల్లేదు' అని అటకాయించిన వాళ్లు లేరు. 'నేను ముందు, నువ్వు వెనుక' అని హక్కు గుప్పించిన వాళ్ళు లేరు. దర్మం నాలుగు పాదాలతో నడవడం ఆరంభమైనట్టే తోచింది.

'ఇదీ పద్ధతి! ఇలా జరగాలి' అని కలెక్టరుగారు పెదవి విప్పి చెప్పలేదు. చెప్పకపోయినా సరే, ఏది ఎలా జరగాలో అలాగే జరిగిపోయింది.

ఇంతకూ ఈ కథ చివర చెప్పాల్సిన ఒక మాట మాత్రం వుండిపోయింది. కలెక్టరు నారాయణ ఎవరోగాదు. పైడి మల్లన్న కుమారుడే.

❖ సీమసాహితి - ఏప్రిల్, 1996 ❖